సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఎన్నికల్లో ఉద్యోగులకిచ్చిన మాటను సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చాడంటే ఎన్ని ఇబ్బందులొచ్చినా నెరవేర్చి తీరుతారని ఆయన వెల్లడించారు. శుక్రవారం ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. రెండు దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న 10,117 మంది సర్వీసును క్రమబద్ధీకరించినందుకు గానూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ సీఎం జగనన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అంతేకాకుండా సీపీఎస్ రద్దు, పీఆర్సీ కమిటీ ఏర్పాటుతో అనేక డిమాండ్లను నెరవేర్చి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారన్నారు. సీఎం జగన్‌కు ఉద్యోగులంతా అండగా నిలవాలని ఆయన కోరారు. తాలుకా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి కుమారస్వామి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేసి వారి జీవితాల్లో సంతోషాల్ని నింపిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఉద్యోగ సంఘం నాయకులు జాకీర్‌హుసేన్, షేక్షావలి, ఉద్యోగస్థులు సుధాకర్, రామక్రిష్ణ, సూర్యనారాయణ, శివప్రసాద్, హొన్నూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల పక్షపాతి అని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసిన సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో సీఎం చిత్రపటానికి ఉద్యోగులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారన్నారు. రాష్ట్రంలో 10 వేల మందికి పైగా పర్మినెంట్ చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఉద్యోగులు శివకుమార్, ధనుంజయ పేర్కొన్నారు. ఉద్యోగులు కిరణ్‌కుమార్, జాన్సన్, రాజేంద్ర ప్రసాద్, రాఘవేంద్ర, హరి క్రిష్ణ, ప్రసాద్, ముకుందర్, ఆది తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లుటౌన్: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే వైవీఆర్



బీకేఎస్‌లో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

మాయల ఫకీరు చంద్రబాబును నమ్మొద్దు

● ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: 2024 ఎన్నికల్లో చంద్రబాబు మారువేషాలతో మాయల ఫకీరులా వస్తాడని ప్రజలు ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. యంగన్నపల్లి, బసినేపల్లి తండా గ్రామాల్లో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నేత లాలూనాయక్‌తో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప వద్దకూ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షేమ లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత అన్నింటినీ విస్మరించారన్నారు. మాయల ఫకీరు వేషాలతో మళ్లీ ప్రజలకు ముందుకు వస్తున్నాడని మళ్లీ ఆయన వస్తే జన్మభూమి కమిటీలను తీసుకొచ్చి సంక్షేమ పథకాలు, పింఛన్లు తొలగిస్తాడని ఆరోపించారు. బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని మీ ఇంటికి తెచ్చిస్తా అని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క రూపాయైన చెల్లించాడా అని ప్రశ్నించారు. బాబులా మాయపాటలు చెప్పి అధికారం వచ్చాక తను అలా చెప్పలేదని బుకాయిస్తాడని జగనన్న అలా మాయమాటలు చెప్పడన్నారు. జగనన్న హామీలు అమలు సాధ్యం కావని ఎందరో సీనియర్లు చెప్పారని, అయితే అధికారం వచ్చాక వాటిని అమలు చేసి చూపారన్నారు. అధికారం కోసం బాబులా మాయమాటలు చెప్పి మోసం చేసే తత్వం జగనన్నది కాదన్నారు. యంగన్నపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పిట్ల రంగస్వామికి రూ.10 వేలు, బసినేపల్లి తండాలో క్రికెట్ మైదానం శుభ్రం చేసేందుకు యువకులకు రూ.10 వేలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేని దేవమ్మకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు. గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫరూక్, వరదరాజులు, రమణ, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బేడల వెంకట్రాముడు, ప్రవీణ్, లక్ష్మిరెడ్డి, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

అభివృద్ధి పనుల్లో గుంతకల్లు ప్రథమం

గుంతకల్లు రూరల్: సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణంలో జిల్లాలోనే గుంతకల్లు మండలం మొదటిస్థానంలో నిలిచిందని ఎంపీపీ బీవీ మాధవి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతిని నివేదించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు సరఫరా చేసినట్లు ఎంఈఓ కుళ్లాయప్ప తెలిపారు. నియోజకవర్గంలో పదవ తరగతి పరీక్షల్లో టాప్ త్రీలో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక నగదు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్ పశుబీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ మహేష్ కోరారు. సొంతస్థలం ఉన్న 1400 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరయ్యేలా దరఖాస్తులను అప్‌లోడ్ చేసినట్లు హౌసింగ్ సిబ్బంది తెలిపారు. ఈవోఆర్డీ బారస్ సాహెబ్, కోఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పావని, పరశురాముడు, హరి చక్రవర్తి, చిన్న ఆంజనేయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ జాషువా, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణప్పను ఎంపీపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు

బుక్కరాయసముద్రం: ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కలెక్టర్లు నాగజ్యోతి, కేశవర్ధన్‌రెడ్డి, కృష్ణానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్, కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా పేదలకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, మందులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని యాప్‌ను పరిశీలించారు. ప్రజలకు వైద్య సేవలు అందించుటలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, డాక్టర్లు స్వాతి, శ్రీహర్ష, వినోద్ లక్ష్మి, సర్పంచ్ నరసమ్మ, ఉప సర్పంచ్ లీలావతి, హెస్త్ అసిస్టెంట్లు శివానంద, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, అంజలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కృష్ణానాయక్, నాగజ్యోతి, కేశవర్ధన్‌రెడ్డి సందర్శించారు. సీహెచ్‌సీలో వైద్య సేవలు గురించి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రమణనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగుల వద్దకు వెళ్లి , వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. నాడు–నేడు కింద చేపట్టిన భవనాలను పరిశీలించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

గుంతకల్లుటౌన్: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తెలియజేశారు. శుక్రవారం ఉదయం ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణంలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లల్లో పనిచేసే పోలీసు అధికారులు, సిబ్బంది పరేడ్ నిర్వహించారు. డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ బందోబస్తులు, ట్రాఫిక్ కంట్రోలింగ్, రాత్రివేళల్లో గస్తీలు నిర్వహించే పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సేవ చేయగలుగుతారన్నారు. పోలీస్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. అంకితభావం, సేవాదృక్పథంతో విధులు నిర్వరిస్తూ పోలీస్ ప్రతిష్ఠ పెంచాలని ఆయన సూచించారు. వన్‌టౌన్, రూరల్ సీఐలు రామసుబ్బయ్య, మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐలు గోపాలుడు, నరేంద్ర, ఏఆర్ ఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

పి.చింతలపల్లిలో కూలిన ఇల్లు

పుట్లూరు: పి.చింతలపల్లి గ్రామంలో శుక్రవారం నారాయణరెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో నారాయణరెడ్డితో పాటు కుటుంబసభ్యులు బయట ఉండటంతో ప్రమాదం తప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. పైకప్పు పూర్తిగా కూలిపోవడంతో ఇంటి సమాగ్రి, ఇతర వస్తువులు దెబ్బతిన్నాయన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో అనంతపురం– తాడిపత్రి రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. తాడిపత్రి వైపు నుంచి అనంతపురం వస్తున్న ఓ కారు వేగంగా వస్తూ అదుపు తప్పి 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గుత్తి రూరల్: బసినేపల్లి తండాలో టీడీపీ చెందిన రెండు కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు అయిన గ్రామానికి చెందిన శివుడు నాయక్, కృష్ణానాయక్ కుటుంబాలకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, మంచి పరిపాలనను చూసి పార్టీలో చేరామన్నారు. నాయకులు లాలూనాయక్, సురేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

గుంతకల్లుటౌన్: సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 9 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.26.14 లక్షల చెక్కులను ఎమ్మెల్యే వైవీఆర్ అందజేశారు. ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందివ్వడమే కాకుండా ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందిన వారికి జగనన్న సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆదుకుంటున్నారన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వైవీఆర్

పూడికతీతతో భూగర్భ జలాల వృద్ధి

యాడికి: పూడికతీతతో భూగర్భ జలాల వృద్ధి చెందుతాయని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ములపాడు సమీపంలోని చెరువులో అమృత్‌సరోవర్ పథకం కింద చేపట్టిన పూడిక తీత పనులను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. పనులు త్వరలో కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అంతకుముందు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో బైక్ చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే స్టేషన్ వద్ద పల్సర్ బైక్ చోరీకి గురైంది. వివరాలు.. గుత్తిలోని శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ లో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేసే వెంకటేష్ పని మీద రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లాడు. అక్కడ పల్సర్ బైక్‌ను పార్క్ చేసి స్టేషన్‌లోకి వెళ్లాడు. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికెన్ సెంటర్‌లో...

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో లోకేశ్వరి, రాజేష్ చికెన్ సెంటర్‌లో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. వివరాలు.. గుర్తు తెలియని దొంగలు చికెన్ సెంటర్ తాళాలు పగల గొట్టి లోపలికి ప్రవేశించారు. చికెన్ సెంటర్‌లోని పెట్టెలో ఉన్న రూ. 10 వేల నగదు అపహరించారు. చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమరాలో నిక్షిప్తమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: టి.కొత్తపల్లిలో అనారోగ్య సమస్యలతో ఓ మహిళ శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వాణి కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. తీవ్రమనస్థాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం సేవించింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న వాణిని గమనించిన కుటుంబసభ్యులు గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రెటరీలు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. జాబ్‌చార్ట్ ప్రకారం ఉదయాన్నే మస్టర్‌కు తప్పనిసరిగా హాజరుకావడంతో పాటు విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసుకోండి

రానున్న రెండు నెలల్లో హంద్రీనీవా, తుంగభద్ర కాలువల నుంచి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లోకి నీటిని పంపింగ్ చేసుకోవడానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన వాటర్ వర్క్స్ ఏఈ శ్రీకాంత్, సిబ్బందితో కలిసి సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లను పరిశీలించారు. ట్యాంకుల్లో నీటి నిల్వల సామర్థ్యం, తాగునీటి వినియోగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరాముడు

పామిడి: ఆర్బీకే సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, గుత్తి ఏడీఏ వెంకటరాముడు సూచించారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏఓ డీ లీనా వసుంధర ఆధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి అగ్రి అడ్వైజరీ సమావేశంలో వారు మాట్లాడారు. ఏడీఏ వేరుశెనగ విత్తన పంపిణీ, ఫర్టిలైజర్స్ లభ్యత, సీసీఆర్‌సీ కార్డుల పంపిణీపై అవగాహన కల్పించారు. జిప్సం, మినీ ట్రాక్టర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, పత్తి ఇన్సూరెన్స్ అందించాలని ఈసందర్భంగా రైతులు వారి దృష్టికి తెచ్చారు. అనంతరం ఏడీఏ ఆర్బీకే సిబ్బందితో వ్యవసాయశాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్ నాయక్, ఏఈఓ శ్రీనివాసరావు, ఏఏబీ మెంబర్లు నారపరెడ్డి, శీనా, నారాయణస్వామి, కుళబ్లుాయప్ప, రమేష్, రఘు, మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ నేత ఓబులేసు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గార్లదిన్నె: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా కార్య నిర్వాహణాధికారి డాక్టర్ చెన్నకేశవులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు షమీన్‌తాజ్, గౌతమి, దిలీప్‌కుమార్, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, పీహెచ్‌ఎన్ అరుణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో 'జనభాగి దారి'

గుత్తి: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం జనభాగి దారి కార్యక్రమం నిర్వహించారు. నూతన జాతీయ విద్యా విధానం, జీ–20 సదస్సు, పర్యావరణ దినోత్సవం వంటి అంశాలపై కూడా ఆన్‌లైన్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, రంగోళి, పద్య పఠనం, డ్రాయింగ్, పెయింటింగ్, నృత్య ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 15 వరకు జనభాగి దారి కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలో ప్రతిభ

తాడిపత్రి టౌన్ : జార్ఖండ్‌లోని రాంచీ వేదికగా ఈనెల 1 నుంచి 5 వరకు జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన ముక్తేశ్వరి ప్రతిభ చాటినట్లు కోచ్ శివ శుక్రవారం తెలిపారు. ముక్తేశ్వరి వెండి, కాంస్య పతకాలు సాధించిందన్నారు.

46 పాఠశాలలకు జేవీకే కిట్లు

పెద్దవడుగూరు : మండలంలోని 46 పాఠశాలలకు జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లు అందజేసినట్లు ఎంఈఓ రాముడు శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 4,135 మంది విద్యార్థులకు కిట్లు వచ్చాయన్నారు. ఈనెల 12 న పాఠశాలలు పునః ప్రారంభం రోజున విద్యార్థులకు కిట్లు అందజేస్తామన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

తాడిపత్రి: కావేటిసముద్రం గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించి ఆరుగురిని ఆపరేషన్లుకు ఎంపిక చేసినట్లు కంటి వైద్యుడు మధుసూదన్‌రాజు తెలిపారు. వీరికి 12, 22, 26, 27, 28 తేదీల్లో అనంతపురంలోని శారదానగర్‌లో ఉన్న సంచార నేత్ర వైద్యశాలలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. చుక్కలూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి లావణ్య కుమారి, సర్పంచు ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

25న మాదిగల ధర్మ పోరాట మహాసభ

తాడిపత్రి టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 25న తాడిపత్రిలో మాదిగల ధర్మ పోరాట మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాసులు తెలిపారు. మాదిగలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీ1 ఏఈ రఘునాథ్ శుక్రవారం తెలిపారు. భాగ్యనగర్, మండీబజార్, హనుమేష్‌నగర్, మోదినాబాద్, పోర్టర్స్‌లైన్, గుంతబావి వీధి తదితర ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

12 నుంచి ఓరియంటేషన్ తరగతులు

నార్పల: ఓరియంటేషన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 12 నుంచి 24 వరకు కళాశాలలో ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 8096907527 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోండి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుక్కరాయసముద్రం మండలం విరూపాక్షినగర్‌కు చెందిన మనెమ్మకు రూ.2 లక్షలు, నార్పల మండలం దిగుమర్రికి చెందిన విశ్వనాథ్‌రెడ్డికి రూ.7.85 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ నారాయణ, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో సమాచార కమిషనర్



స్వామిని దర్శించుకుంటున్న కమిషనర్ కట్టా జనార్ధన్‌రావు

గుంతకల్లు రూరల్: రాష్ట్ర సమాచార కమిషనర్ కట్టా జనార్ధన్‌రావు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు సమాచార కమిషనర్‌కు స్వామి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

గుంతకల్లుటౌన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఉమామహేశ్వరనగర్‌కు చెందిన బోయ వీరేష్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. నిందితుడి నుంచి 50 మద్యం బాటిళ్ల(90 ఎంఎల్) స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఉచిత స్కానింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శ్రీనివాసపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

తాడిపత్రి టౌన్: స్థానిక టైలర్స్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత స్కానింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డెమా భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు కోరారు. శుక్రవారం వారు టైలర్స్‌కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంతోపాటు అంబేడ్కర్‌నగర్, శ్రీనివాసపురం పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. డాక్టర్లు అందిస్తున్న సేవలపై రోగులకు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో అబార్షన్లు జరగడంపై విచారణ చేపట్టారు.

రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వండి



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

పుట్లూరు: భూ సమగ్ర సర్వే చేపట్టే సమయంలో సంబంధిత పొలాల రైతులకు తప్పనసరిగా సమాచారం అందించాలని ఆర్డీఓ మధుసూదన్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మడుగుపల్లిలో చేపట్టిన సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వేను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం జంగంరెడ్డిపేటలో కొన్నేళ్లుగా నెలకొన్న భూ వివాదాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్‌కుమార్, రెవిన్యూ అధికారులు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు: మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నకొండయ్య, జే.నరసయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు చిన్న, కుమార్, నాగరాజు, కార్తీక్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు రాకుండా పని చేయండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ఓబులమ్మ

పెద్దపప్పూరు: సచివాలయాల సిబ్బంది విమర్శలు రాకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలనిని డీఎల్‌డీఓ ఓబులమ్మ సూచించారు. శుక్రవారం పెద్దపప్పూరు–1, పసలూరు, నరసాపురం గ్రామ సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని ఆమె సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామక్రిష్ణ, ఈఓఆర్డీ కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.